# మహిళా కార్మికుల దుస్థితి

**గ్రామీణ** భారతంలో వ్యవసాయరంగం మహిళలకు సాంప్రదాయకంగా ఉపాధి కల్పించే రంగం. కాని సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అనుమతులివ్వడం మొదలయ్యాక శ్రామిక మార్కెట్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతూ వుంది. దానిలో భాగంగానే, మన దేశంలోని వస్త్ర పరిశ్రమ మహిళలకు అత్యధికంగా ఉపాధి కల్గించే రంగంగా మారింది. వ్యవసాయ రంగంలో సంక్షోభం ఫలితంగా జీవనోపాధిని వెతుక్కుంటూ నగరాలకు, పారిశ్రామిక రంగానికి గ్రామీణ మహిళల వలసలు ఎక్కువయ్యాయి. ప్రత్యేకంగా మహిళలకుండే సమస్యల కారణంగా వీరు వస్త్ర పరిశ్రమవైపు ఆకర్షితులయ్యారు. దీన్ని అదునుగా చేసుకొని దుస్తుల తయారీ కంపెనీలు మహిళల శ్రమశక్తి దోపిడీ ద్వారా భారీ లాభాలు గడించగలుగుతున్నాయి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణయొక్క నయా ఉదారవాద ఆర్థిక విధాన సమర్థకులు, ఆర్థిక వేత్తలు మాత్రం ఈ ఆర్థిక విధానాలు మహిళలకు ఆర్థికరంగంలో అనేక అవకాశాలు కల్పించాయనీ, తద్వారా మహిళలు బంధవిముక్తులై సాధికారికత లక్ష్యసాధనవైపు పురోగమించగలుగుతున్నారని అంటున్నారు. అంతేకాదు ఉపాధిరంగంలో ప్రస్తుతమున్న మహిళల భాగస్వామ్య స్థాయి చాలదనీ, మనదేశం అభివృద్ధిచెందిన దేశాల సరసన నిలవాలంటే పారిశ్రామిక ఉపాధి రంగంలోకి మరింత ఎక్కువగా మహిళలను తీసుకురావలసి వుందనీ, అప్పుడే వారు సాధికారత దిశగా మరింత ముందడుగు వేయగలరని నయాఉదారవాద ఆర్థిక పండితులు వాదిస్తున్నారు. ప్రపంచ కార్మిక సంస్థ, ఐక్యరాజ్యసమితిలాంటి అంతర్జాతీయ సంస్థలు సైతం మహిళలకు సాధికారత కల్పించడానికి ఈ దిశగా మార్పులు రావాలని వంతపాడు తన్నాయి.

ఈ వాదనలు, ఉద్బోధలు మహిళల ప్రయోజనాలు కాపాడడంలో ఎంతో అభివృద్ధి కరంగా వున్నట్లుగా కన్పిస్తాయి. కాని దుస్తుల తయారీ రంగంలో, సెజ్‌లలో, ఇతర పరిశ్రమల్లో అలాగే వ్యవసాయరంగంలో పనిచేస్తున్న మహిళల వాస్తవ పరిస్థితిని చూస్తే, వీరు చేస్తున్న వాదనల్లోని కపటత్వం, డొల్లతనం బయట పడతాయి. ప్రస్తుత అర్థవలస, అర్థభూస్వామ్య భారత వ్యవస్థపై శ్రమశక్తిని దోపిడీచేసే పెట్టుబడిదారీ విధానాలు, పద్ధతులు రుద్దబడు తున్నాయి. ఈ నేపథ్యంలో మహిళలపై తీవ్ర దోపిడీ విధానాలు ఏ స్థాయిలో రుద్దబడు తున్నాయో వాస్తవ పరిస్థితులు తపరిశీలిస్తే అర్థమవుతుంది.

కర్ణాటకలోని బెంగుళూరులో, తమిళనాడులో, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వద్దవున్న బ్రాండిక్స్ కంపెనీలలోని మహిళా కార్మికులపై నమ్మశక్యంగాని దారుణమైన పని పరిస్థితుల మధ్య కర్కశంగా, అమానవీయ పద్ధతుల్లో శ్రమదోపిడి జరుగుతోంది. ఇది దుస్తుల తయారీ, వస్త్ర పరిశ్రమల్లో మహిళా కార్మికుల దుస్థితి. మహిళా కార్మికుల శ్రమదోపిడీద్వారా ఈ రంగంలోని యజమానులు అత్యధిక లాభాలు ఆర్జిస్తున్నారు.

ఈ మహిళా కార్మికులకు సంఘాలలో జేరడానికిగానీ, సంఘాలుగా ఏర్పడడానికిగానీ అనుమతిలేదు. ప్రభుత్వాల అంగీకారంవల్ల, చూసీచూడనట్లుపోయే విధానాలవల్ల వీరు రాత్రి సమయాల్లో కూడా పనిచేయవలసి వస్తోంది. రోజుకు 10 గంటలపైగా పనిచేసే పరిస్థితికి నెట్టబడుతున్నారు. అవసరార్థం కాలకృత్యాలు తీర్చుకునే స్వేచ్ఛకూడా లేదు. పై అధికారులు వీరిని వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తుంటారు. మేనేజర్లు మహిళలపై దౌర్జన్యాలు చేస్తుంటారు. బెంగుళూరులోని టెక్స్‌పోర్టు దుస్తుల తయారీ పరిశ్రమ ఎల్‌ఎల్‌పి ఫోర్తు స్టేజిలో జరిగిన దౌర్జన్యాన్ని ఈ పరిస్థితులకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. పని ప్రదేశాలకు దగ్గరలో ఈ మహిళలకు వసతి సౌకర్యం కల్పించరు. దీనివల్ల ప్రతిరోజు వారు ఎక్కువ సమయం పనికి వచ్చి వెళ్ళడానికే కేటాయించ వలసివస్తోంది. దీనికితోడు ప్రభుత్వ రవాణా వ్యవస్థ లేకపోవడంతో ప్రైవేటు వాహనాలపై ఎక్కువ మొత్తాలను ఖర్చుపెట్టవలసి వస్తోంది. వారి కొస్తున్న కొద్దిపాటి జీతాల్లో యిదొక అదనపు వ్యయం. మరోవైపు బలవంతంగా వీరితో ఓవర్‌టైం చేయిస్తారు. దీనికి సాధారణ కూలీనే యిస్తారు. సెలవులు వుండవు. పనిభారాన్ని క్రమంగా పెంచుతుంటారు. పనిభారం పెరిగినా వేతనం పెరగదు. మొదట్లో గంటకు 25 నుండి 35 పీసులు కుట్టేవారు. అది ఇప్పుడు 70 కుడ్తున్నా సరిపోవడంలేదు. యజమానులు నిర్ణయించిన లక్ష్యాలు పూర్తి చేయకపోతే చివాట్లు, వేధింపులు భరించ వలసివస్తోంది.

'ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన' మరియు స్కిల్ ఇండియాలాంటి కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకాల క్రింద జార్ఖండ్, ఒడిశా, అస్సాం, మధ్యప్రదేశ్‌లాంటి తూర్పు, ఉత్తర రాష్ట్రాలనుండి నవయువతులను తీసుకు వస్తున్నారు. ఊరుకాని ఊరు; పైగా మహిళలు. వలస మహిళల ఈ నిస్సహాయ పరిస్థితిని ఆసరా చేసుకొని ఈ పరిశ్రమల్లో తక్కువ వేతనాలు యిస్తున్నారు. స్థానిక మహిళలకు కూడా తక్కువ వేతనాలే. తక్కువ వేతనాలు, అవీ సకాలంలో యివ్వకపోవడం, శారీరక, మానసిక వేధింపులతో దుస్తుల తయారీ పరిశ్రమ మహిళా కార్మికులను పీడిస్తోంది.

పైన పేర్కొన్న పద్ధతులలో మహిళా కార్మికులను పీడించడం, అమానవీయ దోపిడీ చేయడంతో పరిశ్రమ సరిపెట్టుకోవడంలేదు.

తమిళనాడు దుస్తుల తయారీ పరిశ్రమలో ఇటీవల సర్వే చేసిన థాంసన్ రీటర్స్ ఫౌండేషన్, యజమానులు అనుసరిస్తున్న ఒక కొత్త దుష్ట విధానాన్ని బయటపెట్టింది. మహిళా కార్మికుల బహిష్టు సందర్భాలలో పనిమానెయ్యకుండా వుండడానికి, వీరికి బహిష్టు నొప్పులు లేకుండా కొన్ని మందులను వాడేవిధంగా ఒత్తిడి చేస్తున్నారు. అవి ఏ మందులో వాటిమీద పేర్లు కూడా

వుండవు. ఈ మందులు వివిధ ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. ఈవిధంగా దుస్తుల తయారీ పరిశ్రమ మహిళల శ్రామిక శక్తిని దోపిడీ చేయడంలో ఒక దుర్మార్గమైన పరిశ్రమగా మారింది.

దుస్తుల తయారీ రంగంలో మహిళా కార్మికుల దోపిడీ ఈవిధంగా వుంటే మహారాష్ట్రలో వ్యవసాయరంగంలో అనుసరిస్తున్న మనసు కలచివేసే, అన్యాయమైన దుష్టఫ్యూడల్ విధానాలు వెలుగులోకి వచ్చాయి.

బహిష్టు సమయాల్లో రెండు మూడు రోజులపాటు మహిళా కార్మికులు ఇతర రోజుల్లో లాగా ఆ స్థాయిలో కష్టపడి పనిచెయ్యలేక పోవడమనేది సహజం. ఈవిధంగా పూర్తి స్థాయిలో పనిచెయ్య లేకపోవడంవల్ల భూ యజమానులకు కొంత నష్టం కలిగే అవకాశం వుంది. అందువల్ల మహారాష్ట్ర భూయజమానులు బహిష్టులయ్యే వయస్సులో వున్న వారిని కాకుండా గర్భాశయ తొలగింపు (హిస్టరెక్టమీ) ఆపరేషన్లు చేయించుకున్న వారిని పనిలో పెట్టుకుంటున్నారు.
దీనివల్ల గర్భం దాల్చిన వ్యవసాయ మహిళా కార్మికులు పొలంపనుల్లో మనకు కన్పించరు. హజ్‌పూర్, దాని పరిసర గ్రామాల్లో గర్భవతు లవడానికి అవకాశముండే 25 సం॥ల లోపు పనిచేసే అమ్మాయిలు ఈ పనుల్లో కన్పించరు. ఇంకా ఆశ్చర్య చకితులనుచేసే విషయ మేమిటంటే అక్కడి భూయజమానులు గర్భాశయ తొలగింపు ఆపరేషన్లు చేయించు కోడానికి నవ యువతులకు అడ్వాన్సులు యిస్తున్నారు. ఎందుకంటే వీరిని తమ పొలం పనుల్లో పెట్టుకోవడానికి!

సిగ్గుమాలిన వాస్తవమేమంటే భూ యజమానులు శస్త్ర చికిత్సవల్ల బహిష్టు అవకాశంలేని మహిళలను, తమ లైంగిక వాంఛ తీర్చే మహిళలను మాత్రమే తమ పనుల్లో పెట్టుకుంటున్నారు. మహారాష్ట్రలోని బీడ్‌జిల్లాలో మొదలైన ఈ జాడ్యం రాష్ట్రమంతా వ్యాపించింది.

ప్రస్తుతం ఈ దుష్టవిధానం భారతదేశం లోని యితర రాష్ట్రాలకు కూడా వ్యాపించే ప్రమాదం ముంచుకొస్తుంది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణయొక్క నయా ఉదారవాద ఆర్థిక విధానాల నీడలో మన దేశంలో అనుసరింపబడ్తున్న ఈ విధానాలు– మహిళా కార్మికులకు సాధికారికతను కల్పిస్తున్న తీరు ఏవిధంగా వుందో వెల్లడిచేస్తున్నాయి.

oooo